తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ బుధవారం 22 - 04 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 1

# రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్‌పై దుష్ప్రచారం

## టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్



ప్రజావారధి/ఆలేరు

బీజేపీ రాజకీయ లబ్ధి కోసమే మహిళా బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ప్రవేశపెట్టి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేందుకు ద్రోహం తలపెట్టిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఆలేరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాది రాష్ట్రాల జనాభా ప్రతిపాదికన అక్కడ ఎక్కువ ఎంపీ సీట్లు పెంచి, తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాల అధికారాన్ని దెబ్బతీయడం కోసం మహిళా బిల్లు చాటున పునర్విభజన బిల్లును ఆమోదం చేయించాలని భారీ కుట్రకు మోడీ ప్రభుత్వం పూనుకుంటే కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని తెలిపారు. కాంగ్రెస్ మహిళలకు వ్యతిరేకమంటూ బీజేపీ దుష్ప్ర చారం చేస్తుందని, అసలు మహిళలకు రిజర్వేషన్ కల్పించిందే రాజీవ్‌గాంధీ హయాంలోనే అన్న విషయాన్ని తెలుసుకోవాలని చెప్పారు. ప్రతిభాపాటిల్, మీరానాయర్ వంటి మహిళలను రాష్ట్రపతి, స్పీకర్ పదవులకు ఎంపిక చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నర్సింహా రావు ప్రధానమంత్రులుగా ఉన్నప్పుడు మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. బీజేపీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఎక్కువ స్థానాలను ఉత్తరాదిలో పెంచుకోవడం ద్వారా మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావాలన్న బీజేపీ కుట్రలను కాంగ్రెస్ సాగనివ్వదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధానిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.




# జనగణనలో ఎన్యూమరేటర్ల పాత్ర ఎంతో కీలకం

ప్రజావారధి/ఆలేరు

జనగణనలో ఎన్యూమరేటర్ల పాత్ర ఎంతో కీలకమని తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు అన్నారు. జనాభా లెక్కల సేకరణపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఆలేరు ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జనగణన చేయాలని సూచించారు. ఆర్థిక కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలతో పాటు ఇతర ఎన్నో అంశాలకు జనాభా లెక్కలే కీలకమవుతాయని, అన్నిరకాల సమాచారాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన బ్లాక్‌లను, వాటికి సంబంధించిన మ్యాపులను సరిచూసుకొని ఫీల్డ్ మీదకి వెళ్లాలని, ఫీల్డ్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేస్తామన్నారు. జనాభా లెక్కల సేకరణ కోసం ఇళ్లకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించి తమ కుటుంబ సమాచారం ఇవ్వాలని కోరారు. జనగణనను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు దూడల వెంకటేష్, తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు దశమంతరెడ్డి, నాగేశ్వర్ రావు, లచ్చునాయక్, నరేష్, జ్యోతిర్మయి, జ్యోతి, నాగలక్ష్మి, ఏఎస్ఓ మహేష్, భవాని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.